పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 13 - 10 - 2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

# రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది
- వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని రేవంత్ విమర్శించారు
- సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు



**కబురు న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 12 :** అధికారాన్ని పదిలం చేసుకొనేందుకు ఈడీ, ఐటీ అనేక అస్త్రాలు ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు ఎస్?ఐఆర్ అనే ఆయుధాన్ని ప్రయోగించిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమనే అంచనాతో వ్యతిరేకుల ఓట్లను బీజేపీ తొలగించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన ధర్నా కోసం దిల్లీ చేరుకున్న రేవంత్ రెడ్డి ఎస్?ఐఆర్ ప్రక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఓటు హక్కు కల్పించేందుకు ఎస్?ఐఆర్ తీసుకువస్తే, ఇప్పుడు ఓట్లను దూరం చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు.ఆనాడు సైమన్ గో బ్యాక్ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉద్ధృతంగా సాగిందన్న రేవంత్ రెడ్డి అంబేద్కర్ ప్రపంచమంతా తిరిగి ఎన్నో రాజ్యాంగాలను అధ్యయనం చేశారని గుర్తు చేశారు. ఎంతో అధ్యయనం చేసి ఓటుహక్కును మన రాజ్యాంగంలో చేర్చారని, పాలకుడు రాచరికం, వంశపారంపర్యంగా - మిగతా 2 లో



## ప్రజల దాహం కంటే
# బీర్లే ముఖ్యమా?

- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ

**కబురు న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 12 :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత,హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు - మిగతా 2 లో

## ఈడీ, సీబీఐ సరిపోక
# ఈసీని వాడుకుంటున్నారు



- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్
- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

**కబురు న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 12 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ - మిగతా 2 లో

# 'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ అయిపోయింది!

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్
- వాట్సాప్‌లో 'N O' అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ
- ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్
- ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం
- గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేయాలని సూచించిన సజ్జనార్
- మోసపోతే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి



**కబురు న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 12 :** ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'N O' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం! సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా - మిగతా 2 లో

## నిరసన స్థలంగా
# జంతర్ మంతర్ తొలగింపు




- స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్
- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

**కబురు న్యూస్, ఢిల్లీ, అక్టోబర్ 12 :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ - మిగతా 2 లో

# ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026

- రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం
- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోజనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు



2 లో..

## సౌదీపై దాడి అమెరికా రంగంలోకి దిగితే
# యుద్ధం మరింత భీకరమేనా?



2 లో

- సౌదీపై హూతీల దాడులతో పెరిగిన ప్రాంతీయ ఉద్రిక్తతలు
- యెమెన్‌లో సౌదీ మద్దతుతో ప్రభుత్వ దళాల ఎదురుదాడి
- అమెరికా ప్రత్యక్ష సైనిక చర్య చేపట్టే అవకాశంపై చర్చ
- సౌదీ రక్షణకు టర్కీ, పాకిస్థాన్ మద్దతు కీలకం
- హూతీల క్షిపణులు, డ్రోన్ల సౌదీకి సవాలు

## ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికలు
# మున్సిపాలిటీల రిజర్వేషన్లు



- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది

**కబురు న్యూస్, అమరావతి, అక్టోబర్ 12 :** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది.ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. - మిగతా 2 లో



## రైతు బజార్లలో కిలో
# సన్నబియ్యం రూ.50కే

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఏపీ రైతు బజార్లలో కెఎన్ఎం సన్నబియ్యం విక్రయాలు
- రూ.49కే అందుబాటులో ఉన్న బీపీటీ బియ్యం
- పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్య
- ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాక్

**కబురు న్యూస్, అమరావతి, అక్టోబర్ 12 :** సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. - మిగతా 2 లో

# రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు
- తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు



**కబురు న్యూస్, అమరావతి, అక్టోబర్ 12 :** తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇవాళ సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రూ.3222 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. తిరుమల కొండపై రద్దీ తగ్గించేందుకు కింద తిరుపతిలో వసతి సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నారు.తిరుమలకు వచ్చే భక్తులకు వసతి నుంచి అన్నప్రసాదం, పార్కింగ్ నుంచి రవాణా వరకు అన్ని సౌకర్యాలను ఒకేచోట కల్పించేలా ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌తో పాటు టీటీడీ ఉద్యోగుల నివాస లేఅవుట్, తిరుపతి నగరంలో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు వెంకటాద్రి యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.అలిపిరి వద్ద రూ.1332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2700 గదులతో వసతి సముదాయాలను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు 15,000ల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. రూ.160 కోట్లతో ఒకేసారి ఆరు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే కేంద్రాన్ని, రూ.486 - మిగతా 2 లో

# సంపాదకీయం

## రసాయన రియాక్టర్లుగా డంప్‌యార్డులు!



స్వచ్ఛత అంటే చెత్తను కనిపించకుండా చేయడమేనా? లేక పర్యావరణానికి హాని కలగకుండా దాన్ని నిర్వహించడమా? భారత పట్టణాల వ్యర్థాల నిర్వహణ తీరును పరిశీలిస్తే మొదటి పద్ధతే పాటిస్తున్నారని అర్థమవుతోంది. ప్రతి ఉదయం మున్సిపల్ వాహనాలు వీధుల్లో చెత్తను సేకరిస్తాయి. ప్రజలు శుభ్రమైన రోడ్లను చూస్తారు. పాలకులు పరిశుభ్రత విజయాలను ప్రచారం చేసుకుంటారు. కానీ నగర శివార్లలో పడేసిన అదే చెత్త కొద్ది రోజుల్లో విషవాయువులు వెదజల్లే, భూగర్భ జలాలను కలుషితం చేసే, ప్రజారోగ్యానికి ముప్పుగా మారే రసాయన రియాక్టరుగా రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఈ వాస్తవం ప్రజా చర్చల్లో ఎక్కడా చోటు దక్కించుకోదు.ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల్లో అధిక భాగం సేంద్రియమే. అవి పశువులకు మేతగా, పొలాలకు ఎరువుగా, ప్రకృతిలో మళ్లీ కలిసిపోయే వనరులుగా ఉపయోగపడేవి. కానీ పట్టణ జీవనశైలి వ్యర్థాల స్వరూపాన్నే మార్చేసింది. ప్లాస్టిక్ సంచులు, ప్యాకేజింగ్ పదార్థాలు, వైద్య వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాటరీలు, రసాయనాలు, నిర్మాణ వ్యర్థాలు, ఆహార అవశేషాలు అన్నీ ఒకే ట్రక్కులో చేరి, చివరకు ఒకే డంప్‌యార్డులో పడుతున్నాయి. అక్కడి నుంచి ప్రారంభమయ్యే రసాయన, జీవరసాయన చర్యలు సంవత్సరాల తరబడి కొనసాగుతుంటాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు శాస్త్రీయ నిర్వహణ లేని డంప్‌యార్డుల్లాంటి స్థలాలను 'స్లో కెమికల్ రియాక్టర్లు'గా అభివర్ణిస్తున్నారు.డంప్‌యార్డు అనేది కేవలం చెత్త గుట్ట కాదు. అది నిరంతరం పనిచేసే జీవ, రసాయన ప్రయోగశాల. సేంద్రియ వ్యర్థాలు ఆక్సిజన్ లేని పరిస్థితుల్లో కుళ్లిపోవడంతో మీథేన్ వాయువు విడుదలవుతుంది. ఈ వాయువు కార్బన్ డై ఆక్సైడ్ కంటే అనేక రెట్లు ఎక్కువగా భూతాపాన్ని పెంచుతుంది. చెత్త గుట్టల్లో తరచూ చెలరేగే మంటలకు ఇదే కారణం. ఆ మంటల నుంచి విడుదలయ్యే డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, సూక్ష్మ ధూళికణాలు ఊపిరితిత్తుల వ్యాధులకు, గుండె సమస్యలకు, క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని అనేక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వర్షాకాలంలో చెత్తలోంచి కారే లీచేట్ భూగర్భ జలాలను విషపూరితం చేస్తుంది. దశాబ్దాల పాటు ఆ ప్రభావం కొనసాగుతుంది.దేశవ్యాప్తంగా ప్రతి ఏటా పట్టణ ఘన వ్యర్థాల పరిమాణం పెరుగుతూనే ఉంది. కానీ దానికి అనుగుణంగా శాస్త్రీయ ప్రాసెసింగ్ కేంద్రాలు, రీసైక్లింగ్ వ్యవస్థలు, కంపోస్టింగ్ యూనిట్లు, వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు పెరగడం లేదు. ఫలితంగా ప్రతి నగరం తన శివార్లలో ఒక కొత్త పర్యావరణ సంక్షోభాన్ని సృష్టిస్తోంది.తెలంగాణ పరిస్థితి దీనికి మినహాయింపు కాదు. హైదరాబాద్‌లో ఇంటింటికీ చెత్త సేకరణ, యాంత్రిక శుభ్రత వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపించినా, నగరం రోజూ ఉత్పత్తి చేస్తున్న వేల టన్నుల వ్యర్థాలను పూర్తిగా శాస్త్రీయంగా నిర్వహించడం ఇప్పటికీ సవాలుగానే ఉంది. వరంగల్‌లోని రాంపూర్ డంప్ యార్డు పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.స్వచ్ఛ భారత్ మిషన్ వల్ల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అనేక నగరాలు స్వచ్ఛత ర్యాంకుల్లో పోటీ పడుతున్నాయి. అయితే ఆ ర్యాంకుల్లో నగర వీధుల పరిశుభ్రతకు ఇచ్చిన ప్రాధాన్యం, డంప్‌యార్డుల శాస్త్రీయ నిర్వహణకు కూడా సమానంగా లభించిందా? అనే ప్రశ్నకు సమాధానం అంత సంతృప్తికరంగా లేదు. వీధుల్లో కనిపించని చెత్త, పట్టణ శివార్లలో కనిపించే పర్యావరణ విపత్తుగా మారితే దాన్ని అభివృద్ధి అనలేం.వేగంగా పట్టణీకరణ చెందుతున్న రాష్ట్రంగా పాత తప్పులను పునరావృతం చేయకుండా కొత్త నమూనాను అవలంబించే అవకాశం తెలంగాణకు ఉంది. ఇక్కడి నగరాల్లో భవిష్యత్తు వ్యర్థాల ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. ఇప్పటికే పేరుకుపోయిన చెత్త గుట్టలను బయోమైనింగ్ ద్వారా వేగంగా తొలగించాలి. మీథేన్‌ను వృథా కాకుండా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించాలి. లీచేట్ శుద్ధి కేంద్రాలు, భూగర్భ జలాల నాణ్యత పర్యవేక్షణ, ఆధునిక రీసైక్లింగ్ వ్యవస్థలు ప్రతి నగరంలో తప్పనిసరి కావాలి.పౌరుల బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది. ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, స్థానిక సంస్థలతో సహకరించడం ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలి. ప్రతి నగరం తన చెత్తను తానే బాధ్యతగా నిర్వహించగలిగినప్పుడే నిజమైన పరిశుభ్రత సాధ్యమవుతుంది. లేకపోతే మనం నిర్మిస్తున్నవి డంప్‌యార్డులు కాదు... భవిష్యత్ తరాలకు విషాన్ని తయారు చేసే భారీ రసాయన రియాక్టర్లే.

## రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

**మొదటిపేజీ తరువాయి -** కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో ఒకేసారి 16,000ల మంది భక్తులు విశ్రాంతి తీసుకునే సౌకర్యాలు కల్పించనున్నారు.అదేవిధంగా రూ.311 కోట్లతో 4500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ నిర్మించనున్నారు. పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయనున్నారు. తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, 418 ఎకరాల్లో 5192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు రూ.230 కోట్లతో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నారు. తిరుపతి నగరంలో రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు మాస్టర్ ప్లాన్ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దేవుడి కోసం పనిచేసే ఏజెన్సీలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. తిరుమలలోని వాతావరణం ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్‌లో ఉండాలని తెలిపారు. తిరుపతిలో పవిత్రమైన వాతావరణం లేకపోతే మంచిది కాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే

**మొదటిపేజీ తరువాయి -** బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్‌ఎం, ఆర్‌ఎన్‌ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు.ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్‌ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుంది

**మొదటిపేజీ తరువాయి -** కాకుండా ప్రజలు ఎన్నుకునే పద్ధతి తీసుకువచ్చారని కొనియాడారు. 1950లో తొలిసారి ఎస్‌ఐఆర్ పద్ధతిని అమలు చేశారని పేర్కొన్నారు.బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్‌ను టాస్క్ ఇచ్చారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా బీజేపీని వ్యతిరేకించేదని, యువత, నిరుద్యోగులు, పేదలు, ఇప్పుడు యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారని ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌లో తప్పులు జరగుతున్నాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారని, జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బయటపడిందని విమర్శించారు. అలాంటి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించేందుకు ప్రధాని మోదీకి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు."సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయింది. సర్ ప్రక్రియ జరిగిన బిహార్, బంగాల్‌లో బీజేపీ గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా. మరి దేశంలో ఓటర్ల సంఖ్య 97 కోట్ల నుంచి 81 కోట్లకు ఎందుకు తగ్గింది?. దళితులు, ఆదివాసీలు, యువత, నిరుద్యోగుల్లో బీజేపీపై వ్యతిరేకత ఉంది".బీజేపీ వ్యతిరేకులైన దళితులు, ఆదివాసీలు, యువత, నిరుద్యోగుల ఓట్లను తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు. పేదలను ఓటు లేని నిరాయుధులుగా మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ ఉద్యమమే దేశాన్ని కాపాడబోతుందని, దేశ మనుగడకు సంబంధించిన ఉద్యమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికలు.. మున్సిపాలిటీల రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి -** కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3

ఎస్టీ – మహిళ: గూడూరు

ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14

ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.

ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

బీసీ (వెనుకబడిన తరగతులు) – 35

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం,



నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్డ్ (జనరల్)

కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్డ్‌గా ఉన్నాయి.పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు

**మొదటిపేజీ తరువాయి -** మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడి ఉందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026

**మొదటిపేజీ తరువాయి -**

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు.2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

# సౌదీపై దాడి.. అమెరికా రంగంలోకి దిగితే యుద్ధం మరింత భీకరమేనా?

**మొదటిపేజీ తరువాయి -** మధ్యప్రాచ్యంలో ఇప్పటికే రగులుతున్న యుద్ధాగ్ని మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. సౌదీ అరేబియాపై హూతీల దాడులు.. యెమెన్‌లో సౌదీ మద్దతుతో జరుగుతున్న సైనిక చర్యలు.. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగే అవకాశాలు.. ఈ పరిణామాలన్నీ ప్రాంతీయ సంక్షోభాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. సౌదీపై దాడులతో మొదలైన తాజా ఉద్రిక్తత.. అమెరికా, టర్కీ, పాకిస్థాన్‌లనూ ఈ ఘర్షణలోకి లాగుతుందా? అన్న ఆందోళనలు పెరుగుతున్నాయి.సౌదీ రాజధాని రియాద్‌లోని ప్రధాన విమానాశ్రయంపై శనివారం జరిగిన దాడిలో 12 మంది మరణించగా, దాదాపు 300కు పైగా మంది గాయపడ్డారు. ఆదివారం మరో దాడిలో ఒకరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని హూతీలు ప్రకటించారు. యెమెన్ రాజధాని సనాపై సౌదీ దాడులకు ప్రతిస్పందనగానే వీటిని చేపట్టినట్లు పేర్కొన్నారు.యెమెన్‌లో కీలక ప్రాంతాలపై హూతీలు పట్టు సాధించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎర్ర సముద్రం దక్షిణ ద్వారం వద్ద ఉన్న 'బాబ్ అల్ మండెబ్' జలసంధి సమీపంలో హూతీలు భూభాగాలను ఆక్రమించారు. ప్రపంచ వాణిజ్య నౌకాయానానికి ఈ మార్గం అత్యంత కీలకం. దీంతో యెమెన్ ప్రభుత్వ దళాలు ఎదురుదాడి ప్రారంభించాయి. వాటికి సౌదీ యుద్ధవిమానాలు మద్దతిస్తున్నాయి. హూతీల అధీనంలోని మొఖా ఓడరేవును తిరిగి స్వాధీనం చేసుకున్నామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హూతీలు సౌదీపై దాడులను తీవ్రతరం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.సౌదీపై దాడుల్లో ఓ అమెరికా పౌరుడు మరణించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతోంది. హూతీలపై అమెరికా దాడులు చేపడుతుందా? అని ప్రశ్నించగా.. ఆ అవకాశాన్ని పరిశీలిస్తామని ట్రంప్ చెప్పారు. సౌదీకి ప్రత్యక్ష సైనిక సహాయం, గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం వంటి చర్యలు అవసరమని అమెరికా నిఘా విభాగంలో పనిచేసిన విలియం ఉషర్ అభిప్రాయపడ్డారు. అయితే ఇరాన్‌తో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలన్నది వాషింగ్టన్ ముందున్న సవాలు.సౌదీపై దాడులతో విమానాశ్రయ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అంతర్జాతీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. రియాద్‌లో జరగాల్సిన కీలక వ్యాపార కార్యక్రమాలపైనా ప్రభావం పడుతోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్న సౌదీకి ఈ పరిణామాలు సవాలుగా మారాయి. మరోవైపు, హూతీల వద్ద ఇరాన్ రూపకల్పన చేసిన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. చౌకగా తయారు చేయగల డ్రోన్లతో సుదూర దాడులు చేసే సామర్థ్యం ఆ ముఠాకు ఉండటం సౌదీకి పెద్ద సమస్యగా మారింది.హూతీల దాడులను అడ్డుకోవడం సౌదీకి అంత సులభం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో సౌదీ, అమెరికా దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఆ ముఠా తన సామర్థ్యాలను నిలబెట్టుకుంది. ఇప్పుడు సౌదీ మరింత తీవ్రంగా స్పందిస్తే హూతీలు ప్రతిదాడులకు దిగే అవకాశం ఉంది. అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే ఘర్షణ మరింత విస్తరించవచ్చు. అదే జరిగితే యెమెన్‌కే పరిమితమైన పోరు.. మధ్యప్రాచ్యంలోని మరిన్ని దేశాలను ప్రభావితం చేసే సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది.

# 'NO' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ అయిపోయింది!

**మొదటిపేజీ తరువాయి -** ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే చీూ అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'చీూ' అని టైప్ చేసి పంపేస్తారు.అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'చీూ' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ (స్క్రిప్ట్) లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'జుూ' లేదా 'చీూ' అని రిప్లై ఇవ్వకూడదు.అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి. వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు.ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా ఎఎవతీఞతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ వెబ్ సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు



**మొదటిపేజీ తరువాయి -** ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్‌ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?



**మొదటిపేజీ తరువాయి -** గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

## ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ ఎస్. రాజు



**భద్రాచలం అక్టోబర్ 12 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన సీఐ ఎస్. రాజు భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావుని సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భద్రాచలం పట్టణంలోని ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గొందిగూడెం గ్రామపంచాయతీలో విద్యుత్ స్తంభాల మరమ్మతులు కొత్త స్తంభాల ఏర్పాటు



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 12:-** గొందిగూడెం గ్రామపంచాయతీ పరిధి నందు సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో.. పాడైపోయిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు,అవసరమైన చోట్ల వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ సిబ్బంది యంత్రాల సహాయంతో ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే పలు సంబంధమైన ట్రాన్స్ఫార్మర్లకు ఎర్త్ వైర్లను ను ఏర్పాటు చేయుట వంటి విద్యుత్ పరిరక్షణ పనులు చేయడం జరిగినది.గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం లక్ష్యంగా ఈ పనులు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కే.గంగయ్య ,పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రావు, పంచాయతీ సిబ్బంది మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గ్రామ అభివృద్ధే ధ్యేయం.

## వేవా అవార్డు అందుకున్న కట్ట రాజనంధం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : కరీంనగర్ జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతిభా పురస్కారాల (వేవా)కార్యక్రమము కరీంనగర్ కళాభవన్ లో ఘనంగా నిర్వహించారు. పెద్దపెల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం జిల్లా అధ్యక్షులు స్వర్ణ నంది అవార్డు గ్రహీత కట్ట రాజా నందం గతం లో హైదరాబాదు రవీంద్రభారతిలో స్వర్ణ నంది అవార్డు పొందినందుల కు వేవా అవార్డు కమిటీ కన్వీనర్ కందుకూరి శ్రీనివాస్, . వేవా రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన చారి , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కట్టా రవీంద్ర చారి , వేవా జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి దివాకర్ , కోశాధికారి వెలిశాల వెంకట స్వామి ,సిరిసిల్ల డి.ఎస్.పి నాగేందర్ ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు ఈ కార్యక్రమమునకు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పాల్గొన్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కొత్తగా ఎంపికైన విశ్వబ్రాహ్మణ లు తదితరులు పాల్గొన్నారు. ఓదెల మండల విశ్వబ్రాహ్మణులు నాగవెల్లి ఈశ్వర్, శ్రీమన్నారాయణ, రమణాచారి, నాగవెల్లి సంతోష్, నాగులమల్యాల లక్ష్మణ చారి, మడుపు అంజయ్య లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కరుణాకర్ కుటుంబానికి ఇజ్రాయిల్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఉపాధి కోసం దుబాయ్ కు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన ఆలూరు గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గడ్డం చరణ్ కరుణాకర్ (44) కుటుంబానికి ఇజ్రాయిల్ హెల్పింగ్ హ్యాండ్స్ అండగా నిలిచింది.కరుణాకర్ గత సెప్టెంబర్ 20న దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ విషయం తెలుసుకున్న ఇజ్రాయిల్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి,మృతుడి కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయాన్ని విరాళాల రూపంలో సేకరించి భారతదేశంలోని ఆయన కుటుంబ సభ్యులకు పంపించారు.ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా ఆపదలో ఉన్న సభ్యులకు, బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఆర్థిక సాయం అందించిన ఇజ్రాయిల్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు మృతుడి భార్య సునీత, పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ సహాయ కార్యక్రమానికి సహకరించిన ఆలూరు గ్రామ సర్పంచ్ ముక్కెర విజయ్ కి కూడా వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## అక్రమ ర్యాంపుల తొలగింపు

### రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలి,సర్పంచ్ తోగర్ల భూషణ్ వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : ఆలూర్ మండలం రాంచంద్రపల్లిలో గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పు పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తోగర్ల భూషణ్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ భూషణ్ మాట్లాడుతూ.. రహదారులపై, డ్రైనేజీ కాలువలపై నిర్మించిన గోడలు, ఇతర నిర్మాణాలను తొలగించి,నూతన డ్రైనేజీ కాలువల పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజలు రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి చేశారు.గ్రామంలో రహదారులు విస్తరించి,నూతన డ్రైనేజీ కాలువలు నిర్మితమైతే రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాలుగోన్నారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి ధర్నాలో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే

### ఢిల్లీలో టీపీసీసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా

**కొత్తగూడెం, అక్టోబర్ 12: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన ర్యాలీ, ధర్నాలో ఆయన పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమానికి తన సంఘీభావాన్ని తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ఆందోళన నిర్వహించారు. ఏఐసీసీ అధిష్ఠానం పిలుపు మేరకు ఢిల్లీకి చేరుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల సాధన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**జాతీయ స్థాయి నిరసనలో పినపాక ఎమ్మెల్యే**

పినపాక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాయం వెంకటేశ్వర్లు ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపును అనుసరిస్తూ జాతీయ స్థాయిలో నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి తమ నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల సంఘం తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తన డిమాండ్‌ను మరోసారి బలంగా వినిపించింది.




## మొండికుంట సర్పంచ్ ఇంట్లో కామ్రేడ్ విమలక్కకు ఘన సత్కారం

### విమలక్కతో మాటామంతీకి అభిమానుల ఆసక్తి..

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ (ప్రతినిధి)అశ్వాపురం,అక్టోబర్ 12:** బహుజన బతుకమ్మ సంబరాల్లో భాగంగా మల్లెలమడుగు గ్రామానికి విచ్చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు కామ్రేడ్ విమలక్క మొండికుంట గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి నివాసంలో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న విమలక్క అభిమానులు సోమవారం ఉదయాన్నే సర్పంచ్ నివాసానికి చేరుకుని ఆమెను కలుసుకునేందుకు ఆసక్తి చూపారు. విమలక్కతో ఆప్యాయంగా మాటామంతీ జరిపేందుకు, ఆమెతో ఫొటోలు దిగేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సర్పంచ్ నివాసం వద్ద సందడి నెలకొంది. అభిమానులు ఆమెను



పలకరిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ ఇంట ఆతిథ్యం స్వీకరించిన కామ్రేడ్ విమలక్కను మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి దంపతులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా తమ ఇంటికి వచ్చిన ఆడబిడ్డకు చీర,సారె అందజేసి తమ అభిమానాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. బహుజన బతుకమ్మ వేడుకల నేపథ్యంలో విమలక్క మల్లెలమడుగు గ్రామానికి రావడం, మొండికుంట సర్పంచ్ నివాసంలో బస చేయడంతో స్థానిక అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.ఉదయం నుంచే అభిమానులు ఆమెను కలుసుకునేందుకు తరలిరావడంతో సర్పంచ్ నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది.

## అశ్వాపురం మిషన్ భగీరథ సమస్యలపై ప్రజావాణిలో వినతి పత్రం

### మిషన్ భగీరథ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### సర్పంచ్ బానోతు సదర్ లాల్

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం (ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం అక్టోబర్ 12 :-** అశ్వాపురం: అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు సంబంధించి నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ, సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణిలో సర్పంచ్ బానోతు సదర్ లాల్ ఎంపీడీఓ ముత్యాలరావు గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అశ్వాపురంలోని ఆర్ అండ్ బి కార్యాలయం నుంచి మేడ నరసింహారావు గారి ఇంటి వరకు సుమారు 300 మీటర్ల మేర నూతన మిషన్ భగీరథ పైపులైన్ వేయాల్సి ఉందని తెలిపారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. అదేవిధంగా, మంచికంటినగర్‌లో నూతన పైపులైన్ వేసిన 15 రోజులకే గేట్ వాల్వ్ వద్ద వాషర్ దెబ్బతినడంతో నీరు లీకై వృథాగా పోతున్నదని, ఇస్లావత్ నాగ చేను సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతిన్నదని వివరించారు. ఈ సమస్యలను కూడా పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించాల్సిన బాధ్యతను దృష్టిలో ఉంచుకొని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, నీటి లీకేజీలను అరికట్టి దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్పంచ్ బానోతు సదర్ లాల్ సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు.



## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మల్లేష్ యాదవ్ దంపతుల ఆర్థిక సహాయం



**మహేశ్వరం, అక్టోబర్ 12, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయ స్లాబ్ పనులను ఘనంగా ప్రారంభించారు. స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును మాన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ వట్టేల పుష్పమ్మ, మాన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ మరియు మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వట్టేల మల్లేష్ యాదవ్ దంపతులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వట్టేలా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. మహేశ్వరం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయి భక్తులకు అందుబాటులోకి వస్తే మండలంలోని అయ్యప్ప భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.శబరిమలకు వెళ్లలేని భక్తులు సైతం ఇక్కడే అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, అయ్యప్ప దీక్షలు చేపట్టే స్వాములు దీక్షా సమయంలో ఇక్కడే బస చేసేందుకు అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఆలయ స్లాబ్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును తాము భరించేందుకు ముందుకు రావడం పట్ల స్థానికులు, అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వట్టేలా మల్లేష్ యాదవ్, శివగంగ దేవాలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరల రమేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, శ్రీశైలం, వీరేశం పంతులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

### పనులు ప్రారంభించకుంటే ప్రధాన రహదారి దిగ్బంధం

### అధికారులకు వారం రోజులు గడువు

### మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం,అక్టోబర్ 12** : మణుగూరు నుంచి కొత్తగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై మొండికుంట గ్రామ పరిధిలో ఏర్పడిన భారీ గుంతలకు వారం రోజుల్లో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని,లేని పక్షంలో జరిగే ఆందోళనలకు అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని,ఇదే చివరి హెచ్చరిక అని మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి సంధ్య అధికారులకు అల్టిమేటం జారీచేశారు.సోమవారం మొండికుంట గ్రామ పంచాయతీ లో వారు పాత్రికేయులతో మాట్లాడుతూ గ్రామం లోని ఆర్ అండ్ బి రహదారిపై తాత్కాలికంగా మట్టి పోయడంతో గ్రామస్థులు, ప్రయాణికులు,వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మొండికుంట గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య ఆవేదన వ్యక్తం చేశారు.రహదారిపై తక్షణమే నాణ్యమైన మరమ్మతులు చేపట్టి, పూర్తిస్థాయి బీటీ రోడ్డు నిర్మించాలని ఆమె ఆర్ అండ్ బి శాఖ అధికారులను డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభించకపోతే ప్రధాన రహదారిని దిగ్బంధించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.గ్రామం మీదుగా వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. గుంతల్లో మట్టి పోయడంతో భారీ వాహనాలు, ఇసుక లారీలు రాకపోకలు సాగించే సమయంలో విపరీతంగా దుమ్ము లేస్తోందన్నారు.ముఖ్యంగా భారీ వాహనాల వెనుక ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు దారి సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.దుమ్ముతో ప్రజలకు అనారోగ్య సమస్యలు కలుగుతున్నాయని, రహదారిపై ఎగసిపడుతున్న దుమ్ము కారణంగా స్థానిక ప్రజలు, దుకాణదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని మర్రి సంధ్య పేర్కొన్నారు. రహదారి పక్కన నివసించే కుటుంబాలు, వ్యాపారాలు నిర్వహించుకునే వారు దుమ్ము సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.తాత్కాలికంగా పంచాయతీ ట్యాంకర్ ను ఉపయోగించి నీళ్లు కొట్టించినా తాత్కాలిక ఉపశమనమేనని,ఇక సమస్య పరిష్కారానికి ఎదురు చూసే ఓపిక పంచాయితీ సర్పంచ్ గా నాకు,మా గ్రామ పంచాయతీ ప్రజలకు లేదని,అధికారులకు వారం రోజులు గడువు ఇస్తున్నామని,ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి,రహదారిపై శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచ్ మర్రి సంధ్య డిమాండ్ చేశారు.తాత్కాలికంగా మట్టి పోసి చేతులు దులుపుకోవడం కాకుండా,నాణ్యతా ప్రమాణాలతో పూర్తిస్థాయి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం అధికారులకు వారం రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రకటించారు.గడువులోగా పనులు ప్రారంభించకపోతే గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు, తమకు మద్దతుగా నిలిచే ప్రజా సంఘాలతో కలిసి ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైతే రహదారిని దిగ్బంధిస్తామని,అధిక లోడుతో ప్రయాణించే భారీ వాహనాలు,ఇసుక లారీల రాకపోకలను కూడా అడ్డుకుంటామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులు వెంటనే స్పందించాలని, ప్రమాదాలకు తావులేకుండా రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని



ఆమె కోరారు.గడువులోగా సమస్య పరిష్కరించకపోతే తలెత్తే ఆందోళనలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని సర్పంచ్ మర్రి సంధ్య స్పష్టం చేశారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా

ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య..

**మహేశ్వరం అక్టోబర్ 12, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేయాలని దానిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో బీసీ హక్కుల సాధన సమితి మండల మహాసభ నిర్వహించారు.దీనికి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల బీసీ యువత తీవ్రంగా నష్టపోతూ అన్యాయానికి గురవుతోందని యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కులగణనలో బీసీ గణన చేపట్టాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును యాదయ్య తప్పుపట్టారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ హోంమంత్రి అమిత్ షా కేంద్ర ఎన్నికల సంఘాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా 11 మందితో కందుకూరు మండల బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీని పల్నాటి యాదయ్య ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా మార్చ నర్సింహా , ప్రధాన కార్యదర్శిగా జాల హరిబాబు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల రాములు, సహాయ కార్యదర్శి చిప్పలపల్లి రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎం అంజయ్య, వత్తుల నర్సింహా, ఆర్ రమేశ్ పాల్గొన్నారు.



# అవినీతిపై అలుపెరుగని పోరాటం

ప్రజలకు అండగా – అష్రఫ్, కమలాకర్....

ఆర్టిఐ ఆక్టివిస్ట్ & విజిల్ బ్లోయర్ మహమ్మద్ అష్రఫ్....

సమాచార హక్కు రక్షణ చట్టం

రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కమలాకర్....

**పోరు తెలంగాణ అక్టోబర్ 12: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజా ధనానికి రక్షణగా నిలుస్తూ, అవినీతిపై అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజలకు అండగా మహమ్మద్ అష్రఫ్ కృషి చేస్తున్నారు. ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, అవినీతి నిర్మూలనే ఆశయంగా, పారదర్శక పాలనే ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారు. మరోవైపు సమాచార హక్కు చటాన్ని రక్షించేందుకు సమాచార హక్కు రక్షణ చట్టం సొసైటీ ద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తూ, అనేక మంది సామాజిక కార్యకర్తలను, యువతను, ఆర్టీఐ కార్యకర్తలుగా తీర్చి దిద్దుతూ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్టీఐ చట్టాన్ని గ్రామ స్థాయి వరకు విస్తరిస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కొండగుర్ల కమలాకర్ కృషి చేస్తున్నారు. వీరిద్దరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో వారి హక్కులపై చైతన్యం పెంపొందించేందుకు , ప్రజా ధనాన్ని దుర్వినియోగం కాకుండా ప్రయత్నిస్తున్నారు. సమాచార హక్కు చట్టం--2005 ప్రజలకు శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ నిధుల వినియోగం, గ్రామపంచాయతీ ఆదాయ వ్యయాలు, రహదారుల నిర్మాణం, అసంపూర్తి అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై సమాచారం సేకరించి, ప్రజా




ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు అని తెలిపారు. మహమ్మద్ అష్రఫ్ ఇప్పటికి వేలల్లో ఆర్.టి.ఐ వేసి వాటి న్యాయ పరమైన ఆర్డర్ల కొరకు ఎదురుచూస్తూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా, అతని పై బెదిరింపులు వచ్చినా, అనధికారిక తప్పుడు కేసులు పెట్టిన, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మహమ్మద్ అష్రఫ్, ప్రభుత్వ రికార్డులను పరిశీలిస్తూ, ప్రజాధనం చట్ట బద్ధ వినియోగంపై వివరాలు కోరుతూ, సమస్యలను ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాల్లో పోరాటం కొనసాగిస్తున్నారు. అదేవిధంగా సమాచార హక్కు రక్షణ చట్టం--2005 సొసైటీ ఉపాధ్యక్షులు కొండగుర్ల కమలాకర్ చట్ట పరిరక్షణతో పాటు ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటు, కార్యకర్తల సమన్వయంతో, ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తున్నారు. సమాచార హక్కు దరఖాస్తుల విధానం, సమాచారం పొందే ప్రక్రియ, నిర్ణీత గడువులో సమాచారం అందకపోతే అనుసరించాల్సిన అప్పీల్ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా హక్కుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యంతోనే పారదర్శక పాలన సాధ్యమవుతుందని, ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకుని సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమలాకర్ సూచిస్తున్నారు. ప్రజలు ప్రశ్నించినప్పుడే ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజాధనాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొంటున్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రజాధన సంరక్షణ, పారదర్శక పాలన లక్ష్యంగా మహమ్మద్ అష్రఫ్ చేస్తున్న కృషికి, కొండగుర్ల కమలాకర్ నాయకత్వంలో సమాచార హక్కు రక్షణ చట్టం--2005 సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలు తోడై, ప్రజల్లో మరింత చైతన్యం తీసుకువస్తుంది. సమాచార హక్కు చట్టం 21 అమలు దినోత్సవం సందర్భంగా వీరు మరింత సహా చట్టం అమలు కొరకు, రక్షణ కొరకు కృషి చేయాలని విద్యావంతులు, మేధావులు, సామాజిక, ఆర్టీఐ కార్యకర్తలు కోరుకుంటున్నారు.

# అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 31 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్




**కొత్తగూడెం అక్టోబర్ 12. పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించడంతో పాటు, ప్రజలకు పోలీసు శాఖ సేవలు, బాధ్యతలు, త్యాగాలపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, పోలీస్ అమరవీరుల కుటుంబాల పరామర్శ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పోలీసుల విధులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల భద్రతలో పోలీసుల పాత్రను ప్రజలకు వివరించనున్నారు. అలాగే పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల త్యాగాలను వివరిస్తూ పాటల కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ప్రధాన కూడళ్లలో అమరవీరుల సంస్మరణ బ్యానర్లను ఏర్పాటు చేయనున్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం వారు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్య

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12. (పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరై నర్రాగుల లావణ్య శ్రీనివాస్ దంపతులకు నూతన వస్త్రాలను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్యలు అందజేశారు ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సహకారంతో దోమకొండ మండలానికి 122 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. దోమకొండ 44 అంబర్పేట్ 20 అంచనూర్ 5 చింతామణి పల్లి 6 గొట్టుముక్కల 6 లింగు పల్లి 3 ముత్యంపేట్ 21 సంగమేశ్వర్ 17 మంజూరైనట్లు వివరించారు కార్యక్రమంలో దోమకొండ సింగిల్ విండో చైర్మన్ అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సీతారాశీ మదు



ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింలు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి మార్గానికి దిక్సూచిలా ఓదెల గ్రామం

ఎంతోమందికి ఉపాధి చూపిస్తున్న ఓదెల మల్లన్న గ్రామం






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల అక్టోబర్ 12 సోమవారం 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం వెలసిన ఓదెల గ్రామం ఊరికి ఈశాన్యం లో కాకతీయ కెనాల్ ఉండడంతో వాస్తు రీత్యా గ్రామానికి శుభ సూచికమని గ్రామ పెద్దలు స్థానికులు చెబుతుంటారు ఉపాధి కోసం గ్రామానికి వచ్చిన ఉపాధి కూలీలు ఎంతోమందికి పైగా భవన నిర్మాణ కార్మికులు వలస కూలీలకు పని కల్పించి అన్నం పెడుతున్న అన్నపూర్ణ గ్రామం మా ఓదెల గ్రామం మల్లికార్జున స్వామి దయవల్ల ఉపాధికి కొదవలేదని వలస వచ్చిన కూలీలు చెబుతుంటారు మండలంలో 22 గ్రామాలకు మండల కేంద్రంగా అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంది . పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం వేలాదిమంది భక్తులతో ప్రతి సంవత్సరం కోటి పైగా ఆదాయంతో విరాజిల్లుతుంది. కల్మషం లేని గ్రామ ప్రజలు సిల్వర్ స్క్రీన్ పై ఓదెల రైల్వే స్టేషన్, చదువులు చెప్పే గురువులు, హాస్యనటులు, ఆదర్శ రైతులు, కవులు, కళాకారులు చిత్రకారులు, సినిమా డైరెక్టర్లు, డాక్టర్లు, న్యాయవాదులు, తెలంగాణ ఉద్యమకారులు,రక్షక బటులు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు, పండితులు, రాజకీయ నాయకులు ఉన్నారు.

# అబద్ధాలకు అడ్డుకట్ట!



కొందరు పిల్లలు.. చాలా సులభంగా అబద్ధం చెప్పేస్తుంటారు. తప్పు చేసినప్పుడో, తల్లిదండ్రులను సంతోషపెట్టడానికో.. కట్టుకథలు అల్లుతుంటారు. పెరుగుతున్న కొద్దీ 'అది తప్పు!' అని తెలుసుకొని మానేస్తారు. కొందరు మాత్రం.. పెద్దయ్యాక కూడా కొనసాగిస్తుంటారు. 'అబద్ధాల కోరు!'గా ముద్రవేసుకుంటారు. అలా కావొద్దంటే.. బాల్యంలోనే అసత్యాల కొమ్మను వంచేయాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు అబద్ధాలు చెప్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది. అప్పుడప్పుడు చెబితే ఫర్వాలేదు. కానీ, అన్నిటికీ అబద్ధం చెబుతుంటే మాత్రం.. తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. ఆదిలోనే వాటికి అడ్డుకట్ట వేయాలి. ఇందుకోసం.. పిల్లలు నిజాయతీగా ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలి. వారు ఎప్పుడూ నిజం చెప్పేలా ప్రోత్సహించాలి. అసలు వారు ఎందుకు అబద్ధం చెబుతున్నారో తెలుసుకోవాలి. దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవాలి. నిజం చెప్పినా.. ఎలాంటి సమస్యా ఉండదన్న భరోసా వారికి ఇవ్వాలి. అప్పుడే.. పిల్లలు అబద్ధాలు చెప్పకుండా ఉండగలుగుతారు.

**ఎందుకు అబద్ధం చెబుతారు?**

ఏదైనా పొరపాటు చేసినప్పుడు.. శిక్ష నుంచి తప్పించుకోవడానికి ఎక్కువగా అబద్ధం చెబుతుంటారు. డెవలప్‌మెంట్ సైకాలజీలో 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనం కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. తప్పు చేసినప్పుడు నిజాయతీగా ఉంటే.. ఫలితం ప్రతికూలంగా ఉంటుందని వారి నమ్మకం. అందుకే, అబద్ధాన్ని ఒక వ్యూహంగా మలుచుకుంటారు.ఇక చాలా సందర్భాల్లో తల్లిదండ్రుల ప్రశంసలు పొందడానికి కూడా పిల్లలు అబద్ధాలు ఆడుతుంటారట. 2016లో జర్నల్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ చైల్డ్ సైకాలజీ జరిపిన ఓ పరిశోధన ఈ విషయాన్ని తేల్చింది. తాము అన్నిట్లో బెస్ట్ అనిపించుకోవడానికి, సామాజిక అంచనాలను అందుకోవడానికి పిల్లలు అబద్ధాలు చెబుతారని వెల్లడైంది. పిల్లలు పెరిగేకొద్దీ.. స్వయంప్రతిపత్తిని కోరుకుంటారు. ఈ క్రమంలోనూ అబద్ధం చెబుతారు. ముఖ్యంగా, టీనేజర్లు ఎక్కడికి వెళ్తున్నదీ, ఏం చేస్తున్నదీ తల్లిదండ్రుల దగ్గర దాచి పెడుతుంటారు. జర్నల్ ఆఫ్ అడోలెసెన్స్‌లో 2010లో ప్రచురితమైన సర్వే.. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని బయటపెట్టింది. అయితే, టీనేజర్లు ఇలా సమాచారాన్ని దాచిపెట్టడం వెనక దురుద్దేశం ఉండదు. కేవలం వారి గోప్యత, స్వాతంత్ర్య భావాన్ని కాపాడుకోవడానికే అని సదరు సర్వే తేల్చింది.

# ఆలూరు నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

ఆలూరు నూతన వీడీసీ అధ్యక్షుడిగా

మాజీ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఆలూరు మండల కేంద్రంలో సోమవారం నూతన గ్రామాభివృద్ధి ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ (వీడీసీ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా మాజీ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పెండ ఉదయ్,పుట్ట కిరణ్, కుస్తాపురం కిషన్, క్యాషియర్లుగా మిద్దెల రాజు, దుగ్గి లక్ష్మణ్, చిలుక శ్రీను, కార్యదర్శులుగా సుభాష్, ప్రదీప్, అనంతం, సుమన్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఏలేటి గంగారెడ్డి, దుమాజి శ్రీనివాస్,మర్కంటి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కల్లెం మోహన్ రెడ్డి మాట్లాడుతూ,తనపై నమ్మకంతో వీడీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న గ్రామ పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కమిటీ సభ్యులందరితో కలిసి సమన్వయంతో పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు తదితరులు పాలుగోన్నారు.

# కార్మికుల సమస్యలపై ఏఐటియుసి పోరాటం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహా..

రాష్ట్ర కార్యదర్శి పర్వతాలు..




**మహేశ్వరం, అక్టోబర్ 12, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరంగా పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. సోమవారం కందుకూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ కార్యాలయాన్ని కొమ్మగల్ల రాజు, దత్తు నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాలు ఈఎస్ఐ,పిఎఫ్ బోనస్ చట్టాల అమలు కోసం నిరంతరం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యూచర్ సిటీ ప్రాంతం రోజురోజుకి అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. అంతర్జాతీయ పరిశ్రమలు వస్తున్నందున వలస కార్మికుల సంఖ్య గణనీయంగా ఉందని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, కార్యవర్గ సభ్యులు దేవేంద్ర గౌడ్, కందుకూరు మండలం అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, ప్రవీణ్, బ్రహ్మాచారి, రవన్న, జంగయ్య, సాంసంగ్, శివ, రమేష్, రాకేష్, కవిత, శాంతి పాల్గొన్నారు.

# తోటి విలేకరికి అండగా ప్రెస్ క్లబ్ సభ్యులు

అనారోగ్యం తో ఉన్న విలేకరి కి ఆర్థిక సహాయం...




**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి విలేఖరికి మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు అండగ నిలిచారు. ఆ విలేఖరికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.. మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ అనారోగ్యం తో నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితి పై వైద్యులతో మాట్లాడి తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులకు 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ లు పాల్గొన్నారు.

# పులిమామిడి లోభూమాయాజాలం

సీలింగ్ భూములపై బడాబాబుల కన్ను..

కోట్ల విలువ చేసే పేదల భూముల్లో ఫామ్ ల్యాండ్స్ ఫామ్‌హౌజ్‌లు..

చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం ..





**మహేశ్వరం, అక్టోబర్ 12, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కందుకూరు మండలం పులిమామిడి రెవెన్యూలోని పెద్దమ్మతాండ గ్రామంలో సర్వేనెంబర్లు 74,75,77,లో కోట్ల విలువ చేసే సుమారు 30 ఎకరాల పేదల భూముల్లో కొంత మంది బడా బాబులు కెపిఆర్ ఫామ్‌వ్యాలీ, ఫామ్‌హౌజ్‌లు గెస్టు హౌజ్‌ల పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. స్థానిక నాయకుల అండతో సమీపంలోని సర్వేనెంబర్ 68 పట్టా భూమి గోడలను ధ్వంసం చేసి రాత్రి పూట టిప్పర్లు హిటాచిలతో పెద్ద ఎత్తున మట్టిని సీలింగ్ భూముల్లో కి తరలించి అక్రమ నిర్మాణాలు రోడ్లు వేస్తున్నారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పూర్ణచంద్రారెడ్డితో పాటు కె.సంతోష్,కె.మోహన్‌లపై కందుకూర్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పట్టాభూమి యజమానులు ఆరోపించారు.గత ప్రభుత్వాలు సర్వేనెంబర్ 74,75,77లోని 30ఎకరాల భూమిని నిరుపేదలైన ఎ.జంగయ్య జి,లక్ష్మమ్మ ,చాకలిభిక్షపతి నర్సిహ్మ, మహ్మద్‌సాబేర్, మోహినుద్దిన్, సలీమాబీ, భాగ్యమ్మ , బాల్‌రాజ్ , అడడివయ్యతో పాటు మరి కొందరికి సీలింగ్ ఇచ్చారు.వీటితో పాటు 77 సర్వేనెంబర్ ఖరీజుఖాత పేరున ఉన్న ప్రభుత్వ భూములను పేదల నుండి కారుచౌకగా కొట్టేసి అక్రమ దందాకు పాల్పడుతున్నారు.సీలింగ్ భూముల్లో బడాబాబులు ఎలా పాగ వేశారో. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు మొండి వైఖరీ అవలంభిస్తోందో ఉన్నతాధికారులు చర్యలు తీసకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణిలో ఎంపీడీవో కి వినతిపత్రం

# ముసలిమడుగు సర్పంచ్-పూణెం సురేంద్ర




**బూర్గంపాడు అక్టోబర్ 12 తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : బూర్గంపాడు మండలం సోమవారం నాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ముసలిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి సమస్యల గురించి బూర్గంపాడు ఎంపీడీవోకి ముసలమడుగు సర్పంచ్ పూణెం సురేంద్ర వినతిపత్రం అందజేయడం చేశారు

# వారి ఎత్తిపోతలు సుజలమట!



తెలంగాణ, ఆంధ్రలోని ఒకే తరహా సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఒక వర్గం మీడియా ద్వంద్వ వైఖరితో వ్యవహరించడం, సదరు మీడియాలో వెలువడే కథనాలు, వాటి ఉద్దేశం గురించి ప్రధానంగా ఇక్కడ మనం చెప్పుకోవాలి. ఎందుకంటే, తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతుల కండ్లకు గంతలు కట్టి, వాస్తవాలను వక్రీకరించి, ఇక్కడి అన్నదాతల ప్రయోజనాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ, తెలంగాణ సాగు సదుగులిరిగేలా చేసింది, ఇప్పటికీ చేస్తున్నది ఈ పక్షపాతపూరిత కథనాలే. వాస్తవానికి గాలేరు-నగరి, హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. కానీ, మీడియా వీటిని 'సుజల స్రవంతి' పథకాలని నొక్కిచెప్తూ, అవి మంచి పథకాలనే భావనను కలిగిస్తున్నది. భారీ ఎలక్ట్రిక్ మోటర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, సొరంగాలు, లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలపై ఆధారపడటం ద్వారా ఈ రెండు పథకాలు లిఫ్ట్ ఆధారిత సాగునీటి ప్రాజెక్టులే తప్ప, గ్రావిటీ ద్వారా నడిచే ప్రాజెక్టులు ఏ మాత్రం కావని స్పష్టమవుతున్నది. ఇవి ఇంచుమించు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులే.

తెలంగాణ పట్ల చారిత్రక అన్యాయాలు ఎన్నో ఉన్నాయి. గత 60 ఏండ్లలో ఏ పెద్ద ప్రాజెక్టూ గోదావరి, కృష్ణా నదులను సమర్థవంతంగా వాడుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అలుముకున్న 'నిందల' కథనాల వలె ఏపీలోని 'సుజల స్రవంతి' పథకాలపై కథనాలు, వార్తలు ప్రచురితం కాకపోవడంపై తెలంగాణ యువతలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రాజెక్టుల విషయంలో ఆర్థికంగా సాధ్యాసాధ్యాలు, వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్తు భారం, భూసేకరణ, డీపీఆర్‌లు, ముఖ్యంగా నదీ బేసిన్ల వెలుపల నీటి మళ్లింపులపై పత్రికలు, టీవీ ఛానళ్లలో చర్చలు ఎందుకు జరగడం లేదని వారు ఆలోచిస్తున్నారు. కృష్ణా, గోదావరి నీటిని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమనేది ప్రభుత్వం, పాలకుల దయకాదు, అది ఆధునిక భారతదేశంలో ప్రతి రైతు హక్కు. ఏపీలో సాగునీటి విజయాల గురించి ఉత్సవాలు జరుపుకోండి. ఎవరూ కాదనరు. కానీ, అదే సమయంలో సాగునీటి కోసం తెలంగాణ చేసే ప్రయత్నాలపై నిందలు వేయడం, ఆరోపణలు చేయడం, లేనిపోని అనుమానాలు వ్యక్తంచేయడం సరికాదు. రెండు రాష్ట్రాల మధ్య పక్షపాత ధోరణితో కూడిన ఈ కథనాలు- రాజకీయాలు, మీడియా సంస్థల్లో లోతుగా పాతుకుపోయిన ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి మీడియా సంస్థలు ఇప్పటికీ హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తుండటం విచారకరం. దశాబ్దాలపాటు కష్టాలను అనుభవించిన తెలంగాణ రైతులు, యువత ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో, పూర్తి స్పష్టతతో ఉన్నారు. పక్షపాతపూరిత మేధావులతో రాజీపడిన ప్రజాస్వామ్య నాలుగో స్తంభం, అంటే మీడియా పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదంగా సాగిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ గ్రామీణ యువత నేడు తెలంగాణ అవసరాల కోసం గోదావరి, కృష్ణా నదీ జలాలను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను చాలా నిశితంగా గమనిస్తున్నది. వ్యవసాయం చేసేందుకు తమ తల్లిదండ్రులు పడిన కష్టాలను కండ్లారా చూసిన, సాగునీటి కోసం తమ తాతముత్తాతలు పడ్డ వ్యథలను విన్న నేటి యువతరం మదిలో పంటలు పండక అప్పుల ఊబిలో చిక్కుకొని వలసపోయిన విషాదకరమైన

**జ్ఞాపకాలు ఇంకా ఉన్నాయి.**

పొట్టకూటి కోసం తమ తల్లిదండ్రులు పట్టణాలకు వలసపోవడం, వృద్ధుల దగ్గర పిల్లలను వదిలివెళ్లడం, గ్రామాలు ఖాళీ అవడం లాంటి భయానక దృశ్యాలను వారు ఇంకా మర్చిపోలేదు. గోదావరి జలాలను వాడుకోవడంబీ గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ నీటి వాటాలను కాపాడటంలో నేటి పాలకుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, వైఫల్యంపై గ్రామీణ యువత నేడు ప్రశ్నిస్తున్నది. కాళేశ్వరం ఫలితంగా తెలంగాణలో కొత్త తరం నిరాశతో కాదు, భవిష్యత్తుపై ఆశతో వ్యవసాయంపై అభిమానం పెంచుకుంటున్నది. రైతుబంధు ద్వారా నేరుగా నగదు సాయం చేయడం, 24 గంటల ఉచిత విద్యుత్తు అందించడం, ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా సమృద్ధిగా సాగునీరు పారడంతో పాటు, ఇతర రైతు సంక్షేమ పథకాల అమలుతో యువత ఇప్పుడు వ్యవసాయాన్ని ఒక ఉపాధిగా భావిస్తున్నారు. ఇప్పుడిప్పుడే వారిలో ఆలోచన మొదలైంది. కాళేశ్వరం లాంటి ప్రయత్నాలు రెండు మూడు దశాబ్దాల కిందటే జరిగినట్లయితే తమ బతుకులు ఎలా ఉండేవోనని అనుకుంటున్నారు. ముఖ్యంగా, ఇంతకాలం ఎందుకు ఆలస్యమైందని యువ రైతులు నేడు ప్రశిస్తున్నారు. తమకు న్యాయంగా రావాల్సిన కృష్ణా, గోదావరి నీటి వాటా గురించి కూడా ఈ తరానికి పూర్తి అవగాహన ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత నీటి వినియోగం గురించిన అవగాహన కూడా వారికి ఉంది. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తమను మించినవారు లేరని గొప్పలు చెప్తున్న కొన్ని పార్టీల వైఖరిని వారు విమర్శనాత్మకంగా విశ్లేషిస్తున్నారు. రైతులతో కాదు, రైతుల సంక్షేమం కోసం రాజకీయాలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అకస్మాత్తుగా కుంటుతున్నాడు



మా బాబు వయసు మూడు సంవత్సరాలు. హుషారుగానే ఆడుకుంటాడు. ఇంతకుముందు ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అందరిలానే పరుగెత్తుతాడు, మాట్లాడతాడు. కానీ, వారం రోజులుగా తన నడకలో మార్పు కనిపిస్తున్నది. ఎందుకో కుంటుతున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే.. నొప్పి ఉందని, కొన్ని నొప్పి తగ్గించే మందులు ఇచ్చారు. అవి వాడినా తగ్గలేదు. ఇప్పుడు ఏ వైద్యుడిని సంప్రదించాలి? మూడు సంవత్సరాల వయసు పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. బాగా గెంతుతూ ఉంటారు. కుంటిగా నడవడం, నడకలో తేడా వచ్చిందంటే లోపల ఏదో సమస్య ఉండే ఉంటుంది. మీరు ఇప్పటికే వైద్యులకు చూపించామని చెబుతున్నారు. కానీ, ఏ డాక్టర్ అన్నది వివరించలేదు. పిల్లల వైద్యులతో తప్పని సరిగా చికిత్స చేయించాలి. ఎటువంటి గాయం లేకుండా, దెబ్బ కనిపించకుండా ఉన్నా.. పెద్దలు చూడనప్పుడు కిందపడి గాయపడవచ్చు. అవి కనిపించకపోవచ్చు. అందువల్ల నొప్పి, నడకలో మార్పు వస్తుంది. అలాంటి నొప్పి రెండు, మూడు రోజుల్లో సాధారణంగా తగ్గిపోవాలి. కొన్నిసార్లు జాయింట్స్ (కీళ్ల)లో, ఎముకలో, కండరాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి కలగడం, నడకలో మార్పు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ఇన్‌ఫెక్షన్ ఉంటే జ్వరం వస్తుంది. బిడ్డ హుషారుగా ఉండకపోవడం, రోజూ ఆడినట్టుగా ఆడకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు వారం, రెండు వారాలపాటు ఇన్‌ఫెక్షన్ ఉంటే కీళ్లలో నీరు చేరుతుంది.

## కామారెడ్డిలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య

# దోపిడి కేసును ఛేదించిన కామారెడ్డి పట్టణ పోలీసులు

హత్య కేసులో భార్యాభర్తల అరెస్ట్ 8 తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ స్వాధీనం

పక్కా పథకంతో భర్త సహాయముతో పనిమనిషే గొంతు నులిమి దారుణ హత్య

పనిమనిషి ముసుగులో దొంగతనాలు:విచారణలో గతనేర చరిత్ర బట్టబయలు..

గతంలోనూ ఇంట్లో బంగారం చోరీ!

కేసును చాకచక్యంగా ఛేదించిన కామారెడ్డి పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్...






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12(పోరు తెలంగాణ న్యూస్:)** : కామారెడ్డి పట్టణంలోని ముష్రీబ్‌బాగ్‌కు చెందిన చిట్మల్ అనసూయ (66) ను తేదీ 29.09.2026న సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల మధ్య హత్య చేసి, ఆమె ధరించిన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి వచ్చేసరికి అనసూయ మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. ఆమె మెడపై గాయాల గుర్తులు ఉండటంతో పాటు, బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు హత్య, దోపిడి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి తో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతిక సమాచారం, ఇతర దర్యాప్తు వివరాలను విశ్లేషిస్తూ నిందితుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి ఇంట్లో గత కొంతకాలంగా పనిమనిషిగా పనిచేస్తున్న రజితపై అనుమానం రావడంతో పోలీసులు ఆమె ప్రతీ కదలికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో రజిత, ఆమె భర్త నర్సింగ్‌లను గంజ్ పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా, నేరానికి సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**పక్కా పథకంతో హత్య చేసి ఆభరణాలు దోపిడీ**

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే దురాలోచనతో రజిత, నర్సింగ్‌లు మృతురాలి అనసూయ ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించాలని పథకం వేసుకున్నారు. అయితే, తమను అనసూయ గుర్తుపట్టే అవకాశం ఉండటంతో ఆమెను హత్య చేసి ఆభరణాలను దోచుకోవాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. పథకం ప్రకారం, 29.09.2026న అనసూయ భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో అనసూయ ఒక్కతే ఇంట్లో ఉంది అని రజిత తన భర్త నర్సింగ్‌తో కలిసి అనసూయ ఇంట్లోకి ప్రవేశించారు. అనసూయ పూజ చేస్తుండగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆమెను కింద పడేసి మరో గదిలోని ఈడ్చుకెళ్లారు. అనంతరం ఒక తువ్వాలుతో గొంతుపై గట్టిగా బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆమె మరణించినట్లు నిర్ధారించుకున్న అనంతరం, ఆమె ధరించిన బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. నేరంపై అనుమానం రాకుండా రజిత యథావిధిగా అనసూయ ఇంట్లో పనులకు వెళ్ళి వచ్చినట్లుగా నటించారని విచారణలో వెల్లడైంది.

**గతంలోనూ మరో ఇంట్లో చోరీ**

విచారణలో రజిత గతంలో కామారెడ్డిలోని భూమయ్య ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన సమయంలోనూ బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. 2023 సెప్టెంబర్‌లో ఇంటి యజమాని బయటకు వెళ్లగా, ఆయన భార్య తమ కుమార్తెను రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు వెళ్లిన సమయంలో, ఇంట్లో ఎవరులేరని సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడు, 5 గ్రాముల బంగారు చెవి కమ్మలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.

**నిందితుల వివరాలు**

1. బోసు రజిత, భర్త: నర్సింగ్, వయస్సు 40 సంవత్సరాలు, నివాసం: బతుకమ్మ కుంట, కామారెడ్డి.
2. బోసు నర్సింగ్, తండ్రి: యాదయ్య, వయస్సు 48 సంవత్సరాలు, నివాసం: బతుకమ్మ కుంట, కామారెడ్డి.

స్వాధీనం చేసుకున్న సొత్తు

1. బంగారు పుస్తెల తాడు (మంగళసూత్రం).
2. రెండు బంగారు ఉంగరాలు.
3. చెవి ఆభరణాలు.

(మొత్తం సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు.)

4. నిందితురాలి సెల్‌ఫోన్.

ఈ కేసులో నిందితులైన భార్యాభర్తలు ఇద్దరిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఈ కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసి, నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన కామారెడ్డి పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగారావు, పోలీస్ కానిస్టేబుళ్లు రామస్వామి, రాజు నాయక్, సంపత్‌లను జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ గారు అభినందించారు. వారి విధి నిర్వహణ, అంకితభావం, ప్రతిభను ప్రశంసించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల ఇన్చార్జిల ప్రకటన

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము) మణుగూరు అక్టోబర్ 12:-** మిత్రులారా నమస్కారం.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు, పినపాక కరకగూడెం గుండాల ఆళ్లపల్లి మండలాలకు ఈ క్రింద పేర్కొన్న నాయకులను మండల ఇన్‌చార్జులుగా మరియు సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. నియమితులైన ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా పూర్తి చేయాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నాను.

పినపాక మండలం
దాట్ల వాసుబాబు (మండల ఇంచార్జ్)
సమన్వయ కమిటీ సభ్యులు
1. పోలిశెట్టి సత్తిబాబు
2. డాక్టర్ రవి వర్మ
3. కొండేరు రాము
4. గుమ్మడి గాంధీ
5. గుదికొండ రామకృష్ణ

కరకగూడెం మండలం
రావుల సోమయ్య (మండల ఇన్చార్జ్)
సమన్వయ కమిటీ సభ్యులు
1. రేగా కాలిక
2. అక్కిరెడ్డి వెంకటరెడ్డి
3. పోగు వెంకటేశ్వర్లు
4. సారా సాంబయ్య
5. పసునూరి అంజయ్య

ఆళ్లపల్లి మండలం
కొండ్రు మంజు భార్గవి (మండల ఇంచార్జ్)
సమన్వయ కమిటీ సభ్యులు
1. పాయం నరసింహారావు
2. గొగ్గలి రామయ్య
3. కొమరం శంకర్
4. కల్తి నాగేష్
5. కొమరం హనుమంతరావు

గుండాల మండలం
కొండ్రు మంజు భార్గవి (మండల ఇంచార్జ్)
సమన్వయ కమిటీ సభ్యులు
1. తెల్లం భాస్కర్
2. గడ్డం వీరన్న
3. మోకాళ్ళ వీరస్వామి
4. వట్టం రవి
5. ఏడూళ్ళ బుచ్చిరామయ్య

రేగా కాంతారావు




మాజీ ఎమ్మెల్యే, పినపాక నియోజకవర్గంమాజీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు

# మనో వికాసానికి




బాల సాహిత్యమే పునాదిమానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈదశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకుగొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు. బాల సాహిత్యం చదువడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటిద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్దంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి. ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లిష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లిష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాలసాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లిష్ మీడియం స్కూళ్ళల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది.

టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లిషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాసి ప్రచురించారు ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.

## పాత 5 రూపాయల నోటు ఉంటే రూ.17 లక్షలు పాపం రైతుకు ఏం జరిగిందో తెలుసా?




పాత నోట్లు లేదా నాణేలకు బదులుగా లక్షల రూపాయలు ఇస్తామని సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దు. నోట్లు కొనడం లేదా పార్శిల్ పంపడం అనే పేరుతో ఏ అపరిచితుడికీ ముందుగా డబ్బు ఇవ్వవద్దు. అపరిచితుడు పంపిన క్యూఆర్ కోడ్‌ను.. నేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసగాళ్లు ప్రజలను లక్ష్యంగా చేసుకోవడానికి సోషల్ మీడియా ద్వారా కొత్త ఎత్తుగడలను ఉపయోగిస్తున్నారు. మీ వద్ద పాత నోట్లు లేదా నాణేలు ఉండి, వాటిని అమ్మి లక్షల రూపాయలు సంపాదించాలని ఆలోచిస్తుంటే, జాగ్రత్తగా ఉండండి. గుజరాత్‌లో ఒక రైతు పాత రూ.5 నోటుకు బదులుగా రూ.17 లక్షలు ఇస్తామని ఆశ చూపి మోసపోయాడు. గుజరాత్‌లోని వడోదరకు చెందిన ఒక రైతు తన వద్ద ఉన్న రెండు పాత 5 రూపాయల నోట్లు ఉన్నాయని, ఈ రెండు నోట్ల ద్వారా ఏకంగా రూ.34 లక్షల వరకు సంపాదించవచ్చనే ఆశతో దారుణంగా మోసపోయాడు. అతను మూడు రోజుల్లో రూ.1 లక్ష 6 వేల 400 నష్టపోయాడు. ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశతో ఆ రైతు మూడు రోజుల పాటు డబ్బు పంపాడు. కానీ లక్షల రూపాయలు రావాల్సి ఉండగా, అతని 1 లక్ష 6 వేల 400 రూపాయలు మాయమయ్యాయి. ఆ రైతు ఆన్‌లైన్ మోసానికి ఎలా గురయ్యాడో, అతని నుండి డబ్బు వసూలు చేయడానికి ఏ పద్ధతులు ఉపయోగించారో ఇప్పుడు తెలుసుకుందాం.

పాత కరెన్సీ కుంభకోణం ఎలా మొదలైంది?

ఈ కేసు వడోదరలోని జుని సాయర్ గ్రామానికి చెందిన 42 ఏళ్ల రైతు మహేంద్రభాయ్‌కి సంబంధించినది. ఈ సంఘటన జరగడానికి సుమారు 15 రోజుల ముందు, ఆ రైతు తన మొబైల్ ఫోన్‌లో ఒక రీల్ చూస్తున్నాడు. అప్పుడు ఒక పాత రూ.5 నోటుకు బదులుగా రూ.17 లక్షలు ఇస్తామని ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్‌ను అతను చూశాడు. ఆ రైతు దగ్గర అలాంటి రెండు నోట్లు ఉన్నాయి. అతను ఆ ప్రకటనలో ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేసి, ఆ రెండు నోట్ల ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపాడు. అక్టోబర్ 6న ఒక వ్యక్తి వచ్చి ఆ రెండు నోట్లను తీసుకువెళ్తాడని, దానికి బదులుగా రూ. 34 లక్షలు ఉన్న పార్శిల్ పంపిస్తామని చెప్పడంతో ఆ రైతుకు ఫోన్ కాల్ వచ్చింది. ఆ తర్వాత ఆ పార్శిల్ పంపడానికి రూ. 750 అడిగారు. అతను తన ఫోన్‌కు వచ్చిన క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ఆ డబ్బును బదిలీ చేశాడు.

మూడు రోజుల్లో 1 లక్ష 6 వేల మోసం

మరుసటి రోజు అక్టోబర్ 7న మోసగాళ్లు ఫోన్ చేసి, పార్శిల్ తీసుకువెళ్తున్న వ్యక్తి పట్టుబడ్డాడని తెలియజేశారు. అతని విడుదల కోసం వారు రూ. 25,500 డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు వస్తాయన్న ఆశతో ఆ రైతు ఆ డబ్బు పంపాడు. కానీ అక్టోబర్ 8న, మోసగాళ్లు మళ్లీ ఫోన్ చేసి, తమ మనుషుల్లో కొందరిని అరెస్టు చేశారని అబద్ధం చెబుతూ రూ. 53,000 డిమాండ్ చేశారు. తన డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో ఆ రైతు ఆన్‌లైన్‌లో లావాదేవీలు కొనసాగించి, అక్టోబర్ 6 నుండి 8 మధ్య మొత్తం రూ. 1,06,400 కోల్పోయాడు. తాను మోసపోయానని ఆ రైతు గ్రహించాడు.

పాత నోట్లను అమ్మే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోండి:

పాత నోట్లు లేదా నాణేలకు బదులుగా లక్షల రూపాయలు ఇస్తామని సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దు. నోట్లు కొనడం లేదా పార్శిల్ పంపడం అనే పేరుతో ఏ అపరిచితుడికీ ముందుగా డబ్బు ఇవ్వవద్దు. అపరిచితుడు పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే ముందు లేదా వారి సూచనల మేరకు డబ్బు చెల్లించే ముందు, క్షుణ్ణంగా విచారణ చేయండి. ఇక్కడ అందించిన వార్తను టీవీ9 తెలుగు ధృవీకరించడం లేదు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ఆధారంగా దీనిని అందించాము.

## ఫ్లిప్‌కార్ట్‌లో బ్రాండెడ్ ఏసీలు సగం ధరకే సేల్‌లో అద్భుతమైన ఆఫర్లు!



మీకు పెద్ద గదుల కోసం అధిక సామర్థ్యం గల ఏసీ కావాలంటే, బ్లూ స్టార్ 1.5 టన్ 3 స్టార్ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీ ఒక మంచి ఎంపిక. 5-ఇన్-1 కన్వర్టిబుల్ మోడ్‌తో కూడిన ఈ ఏసీ..

సాధారణంగా, వేసవిలో ఏసీల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో వాటి ధరలు కూడా చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ శీతాకాలంలో లేదా ఆఫ్-సీజన్‌లో, ఏసీల ధరలు గణనీయంగా తగ్గుతాయి. అటువంటి ఆఫ్-సీజన్లలో మీరు ఫ్లిప్‌కార్ట్ సేల్స్‌ను సద్వినియోగం చేసుకుంటే, ఏసీలను చాలా తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం మీకు లభిస్తుంది. బ్యాంక్, ఎక్స్ఛేంజ్ ఆఫర్ల కారణంగా ఈ డీల్స్ మరింత లాభదాయకంగా మారతాయి.

1 / 5

ఎజా 2026 మోడల్ 1 టన్ 3 స్టార్ స్ప్లిట్ ఇన్వర్టర్ ాజ: ఎజా బ్రాండ్‌కు చెందిన ఈ 1 టన్ సామర్థ్యం గల 3 స్టార్ స్ప్లిట్ ఇన్వర్టర్ ాజ 7-ఇన్-1 మోడ్ ఫీచర్‌తో వస్తుంది. ఈ ాజ మీ బెడ్‌రూమ్‌ను చాలా వేగంగా చల్లబరుస్తుంది. ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో దీనిపై ఏకంగా 47 శాతం డిస్కౌంట్ లభిస్తోంది. దీని అసలు ధర రూ. 48,991 కాగా, ఈ ాజ సేల్‌లో కేవలం రూ. 25,990 కే అందుబాటులో ఉంది. చిన్న గదుల కోసం ాజ కొనాలనుకునే వారికి ఇది ఒక సరైన ఎంపిక.

2 / 5

గోద్రెజ్ 2026 మోడల్ 1 టన్ 3 స్టార్ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీ: మీకు హెవీ డ్యూటీ, ఏఐ పవర్డ్ ఎయిర్ కండిషనర్ కావాలంటే, గోద్రెజ్ బ్రాండ్ ఉత్తమ ఎంపిక. ఈ ఏసీ 1 టన్ సామర్థ్యం, ఇన్వర్టర్ టెక్నాలజీతో వస్తుంది. దీనికి 5-ఇన్-1 కన్వర్టిబుల్ మోడ్ కూడా ఉంది. దీని ఏఐ టెక్నాలజీ మీ రోజువారీ ఏసీ వినియోగానికి అనుగుణంగా సరైన ఉష్ణోగ్రతను సెట్ చేసుకోవడానికి సహాయపడుతుంది. బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో దీనిపై 33 శాతం తగ్గింపు లభిస్తోంది. దీని ఎంఆర్‌పి రూ. 42,990 కాగా, సేల్‌లో ఈ ఏసీ రూ. 27,990 కే అందుబాటులో ఉంది.

3 / 5

డైకిన్, శాంసంగ్ బెస్పోక్ AI AC డీల్స్: ఎయిర్ కండిషనర్ల రంగంలో మరో విశ్వసనీయమైన పేరున్న డైకిన్, తన 2026 మోడల్ 1 టన్ 3 స్టార్ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీపై 33 శాతం తగ్గింపును అందిస్తోంది. దీని ఎంఆర్‌పి రూ. 48,500 కాగా, ఈ సేల్‌లో మీరు ఈ ఏసీని రూ. 32,490 కే కొనుగోలు చేయవచ్చు.

4 / 5

అంతేకాకుండా, శాంసంగ్ బెస్పోక్ ఏఐ 2026 మోడల్ 0.95 టన్ 3 స్టార్ స్ప్లిట్ ఏసీపై 52 శాతం భారీ తగ్గింపు అందుబాటులో ఉంది. దీని అసలు ధర రూ. 67,990 కాగా, ఈ సేల్ ఆఫర్‌లో మీరు ఈ ఏసీని రూ. 32,490 కే పొందవచ్చు.

## భారత రాష్ట్రపతి కోసం ప్రత్యేక ట్రైన్ ఇంద్ర భవనాన్ని తలపించే సౌకర్యాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే



భారత రాష్ట్రపతులకు ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. ఇందులో రాష్ట్రపతితో పాటు వారి కుటుంబసభ్యులు, అధికారులు, సిబ్బంది మాత్రమే ప్రయాణించవచ్చు. 2026 ఆగస్టు 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సొంత రాష్ట్రమైన ఒడిశాకు ట్రైన్‌లో వెళ్లిన ప్రయాణం దేశం దృష్టిని ఆకర్షించింది. భారత రాష్ట్రపతులకు దేశంలో ప్రత్యేకంగా అనేక సౌకర్యాలు ఉంటాయి. రాష్ట్రపతి భవన్‌లో నివాస సదుపాయంతో పాటు కట్టుదిట్టమైన భద్రత, ఎక్కడికైనా వెళ్లాలంటే ప్రత్యేక విమానం లాంటివి ఉంటాయి. ఇక కాలు బయట పెట్టినా సరే ప్రత్యేక ఎస్కార్ట్ వాహనాలు ఉంటాయి. అయితే రాష్ట్రపతికి ప్రత్యేకమైన రైలు కూడా ఉంటుంది. ఈ రైలులో కట్టుదిట్టమైన భద్రత, అద్భుతమైన విలాసవంతమైన సౌకర్యాలు ఉంటాయి. ప్రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైన్ అంటే కేవలం రైలు కాదు.. దేశ ప్రథమ పౌరురాలి భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించారు. భారతీయ రైల్వేలు రాష్ట్రపతి ప్రయాణానికి అత్యంత అరుదైన భద్రతా ప్రోటోకాల్‌ను పాటిస్తాయి. రాష్ట్రపతి ప్రయాణించే రైలు ఒంటరిగా వెళ్లదు. వారి రక్షణ కోసం మొత్తం మూడు రైళ్లు నడుస్తాయి. ప్రెసిడెన్షియల్ స్పెషల్ రైలు కంటే ముందు ఒక పైలట్ రైలు ట్రాక్‌ను పరీక్షించి మార్గం సురక్షితంగా ఉందని నిర్ధారిస్తుంది. ఆ తర్వాత రాష్ట్రపతి, ఉన్నతాధికారులు, రాష్ట్రపతి భవన్ సిబ్బంది ఉండే ప్రత్యేక రైలు ప్రయాణిస్తుంది. చివరగా రియల్ ఎస్కార్ట్ రైలు అనుసరిస్తుంది. రాష్ట్రపతి ప్రయాణిస్తున్న సమయంలో అదే ట్రాక్‌పై మరో రైలుకు అనుమతి ఉండదు. అంతేకాకుండా మెకానికల్ సమస్యలు తలెత్తితే ఉపయోగించేందుకు సమీప స్టేషన్‌లో ఒక స్టాండ్ బై రైలును కూడా సిద్ధంగా ఉంచుతారు. ప్రయాణం పూర్తయ్యే వరకు మొత్తం మార్గాన్ని పూర్తిగా నిఘాలో ఉంచుతారు. ఎలాంటి అంతరాయం లేకుండా ప్రయాణం సాగేలా చూస్తారు. రాష్ట్రపతి ప్రయాణించే ఈ ప్రత్యేక రైలు.. దేశంలోనే అత్యంత విలాసవంతమైన టూరిస్ట్ రైలు అయిన మహారాజా ఎక్స్‌ప్రెస్‌లోని కొన్ని కోచ్‌లను ప్రత్యేకంగా సిద్ధం చేసి ఈ ప్రత్యేక రైలు రూపొందించారు. రాష్ట్రపతి, వారి కుటుంబ సభ్యులు, అధికారులు, భద్రతా సిబ్బంది కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఈ రైలులో విలాసవంతమైన సౌకర్యాలు ఉన్నాయి. రాష్ట్రపతి బస చేసే ప్రత్యేక కేబిన్‌ను నవరత్న అని పిలుస్తారు. ఇందులో ఒక విశాలమైన లివింగ్ రూం, రెండు బెడ్‌రూమ్‌లు, అటాచ్డ్ వాష్‌రూమ్‌లు ఉంటాయి. ప్రయాణంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఒక ప్రత్యేక మెడికల్ కోచ్ కూడా అందుబాటులో ఉంటుంది. డైనింగ్, లాంజ్ కోచ్‌లు, అత్యాధునిక వంటగదులు కూడా ఈ రైలులో ఉంటాయి. రాష్ట్రపతి ఉండే కోచ్ కిటికీలకు డబుల్ గేజ్డ్ బుల్లెట్ ప్రూఫ్ గ్లాసెస్ అమర్చి ఉంటాయి.

## ఈ వ్యాపారం మొదలుపెడితే రోజూ మీకు డబ్బులే కస్టమర్ల కోసం ఎదురుచూడాల్సిన పనే లేదు



ఏదైనా చిన్న వ్యాపారం మొదలుపెట్టాలని చాలామందికి ఉంటుంది. అలాంటివారి కోసం అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చు. కానీ ప్రతీ వ్యాపారంలో కొన్ని నష్టాలు ఉంటాయి. వాటిని ముందే తెలుసుకోవాలి. కూరగాయల వ్యాపారం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. స్వయం ఉపాధి పొందేందుకు ఏదైనా వ్యాపారం స్టార్ట్ చేయాలని చాలామందికి ఉంటుంది. దీంతో ఏ వ్యాపారం మొదలుపెట్టాలా? అని చాలామంది మదన పడుతుంటారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే వ్యాపారం కోసం వెతుకుతుంటారు. ఇందుకోసం ఫ్రెండ్స్, ఫ్యామిలీవారికి అడగడం, గూగుల్‌లో సెర్చ్ చేయడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇప్పటికే వ్యాపారంలో ఉన్నవారిని అడిగి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఎక్కువ కస్టమర్లు, అధిక ఆదాయం వచ్చే చిన్న వ్యాపారం మొదలుపెట్టాలనుకునేవారికి అనేక అవకాశాలు ఉన్నాయి. మార్కెట్లో ఇలాంటి వ్యాపారాలు చాలానే ఉన్నాయి. అందులో కూరగాయల వ్యాపారం ఒకటిగా చెప్పవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మార్జిన్ ఇందులో పొందే ఛాన్స్ ఉంది. కూరగాయలు ప్రతీ ఇంట్లో రోజూ అవసరం కాబట్టి కస్టమర్లు కూడా పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. సూపర్ మార్కెట్లు వచ్చినా ఇంటి సమీపంలోని షాపులో కూరగాయలు ఎక్కువమంది కొంటూ ఉంటారు. దీంతో ఈ వ్యాపారానికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

**కూరగాయల వ్యాపారం ఎలా మొదలుపెట్టాలి..?**

తక్కువ పెట్టుబడితో ఈ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. మీరు బల్క్‌లో కూరగాయలు తక్కువ ధరకు లభిస్తాయి. మార్కెట్ యార్డులు, రైతు బజార్ల నుంచి తక్కువ ధరకు మీరు బల్క్‌లో కూరగాయలు తెచ్చుకోవాలి. మీరు వీటిని ఎక్కువ మార్జిన్‌కు విక్రయించి లాభం పొందవచ్చు. ఈ వ్యాపారంలో మార్జిన్ ఎక్కువగా ఉంటుంది. చాలా మంది వ్యాపారులు రూ.20కి కేజీ ఆలుగడ్డలు కొని రూ.40కి అమ్మి డబుల్ ప్రాఫిట్ పొందుతారు. అధిక మార్జిన్‌తో విక్రయిస్తే అధిక లాభం వచ్చే అవకాశం ఉంటుంది. అపార్ట్‌మెంట్లు, జనసంచారం ఎక్కువగా ఉండే రద్దీ ప్రదేశాల్లో మీరు షాపు తెరవాలి. తాజా, నాణ్యమైన కూరగాయలను కస్టమర్లకు అందుబాటులో ఉంచాలి. దీని వల్ల మీ షాపుకు కస్టమర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

అయితే కూరగాయలలో ఖచ్చితంగా డ్యామేజ్ లేదా పాడైనవి ఉంటాయి. కొన్నిసార్లు మీరు తెచ్చిన కూరగాయలు అమ్ముడుపోవు. ఇలాంటివాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కస్టమర్లకు సరుకు తూకం వేసేటప్పుడు కొద్దిగా ఎక్కువ వేయడం, కొన్ని డ్యామేజ్ కావడం వల్ల 100 కిలోల సరుకులో సుమారు 20 కిలోల వరకు నష్టం వస్తుంది. రూ.20కి కొన్న ఆలుగడ్డలను రూ.40కి అమ్మాలనుకున్నా.. మార్కెట్‌లో తీవ్రమైన పోటీ ఉంటుంది. మీ దుకాణం మాత్రమే కాదు.. వందల దుకాణాలు ఉంటాయి. కస్టమర్లు నాణ్యతతో పాటు తక్కువ ధరను కోరుకుంటారు. ఇతర దుకాణాలతో పోటీ పడి కొన్నిసార్లు ధరలను తగ్గించాల్సి వస్తుంది. సమయం గడుస్తున్న కొద్దీ సరుకు పాడవకుండా ఉండేందుకు రేట్లను మరింత తగ్గించాల్సి రావచ్చు. వ్యాపారం మొదలుపెట్టేటప్పుడు ఇలాంటి విషయాలను ముందు తెలుసుకోవాలి. కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు ఈ వాస్తవాలను అర్థం చేసుకోకపోతే నష్టపోవచ్చు. ఈ వ్యాపారంలో స్థిరమైన లాభాలు పొందాలంటే.. నష్టం లేకుండా అమ్మడం, పోటీని తట్టుకోవడం, సరైన స్థానాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యమని చెప్పవచ్చు.

## దసరాకు ఇంటికెళ్తున్నారా..? ఈ రైళ్లల్లో ఇప్పటికే సీట్లు ఖాళీ వెంటనే బుకింగ్ చేసేయ్యండి



దసరా, దీపావళికి సొంతూరు వెళ్తున్నారా..? ట్రైన్లలో సీట్లు దొరకవని ఆందోళన పడుతున్నారా..? అయితే మీరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను అనేక మార్గాల్లో ప్రవేశపెట్టింది. ఈ రైళ్లల్లో ఇప్పటికే సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఏయే ట్రైన్‌లో ఎన్ని బెర్త్‌లు ఖాళీగా ఉన్నాయనే వివరాలను రైల్వేశాఖ ప్రకటించింది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారికి దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్, నవంబర్‌లో వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ట్రైన్లలో ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలుపెట్టింది. అయితే ప్రయాణికులు ముందుగానే టికెట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక రైళ్లల్లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల సంఖ్యను రైల్వేశాఖ ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది. దీని వల్ల బెర్త్‌లు ఖాళీలు ఉన్నట్లు గుర్తించి ప్రయాణికులు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడానికి వీలు కలుగుతుంది. పండుగల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ వివరాలను ప్రతీరోజుల రైల్వేశాఖ విడుదల చేస్తూ వస్తోంది. అక్టోబర్ 11 రాత్రి 8 గంటలకు నాటికి పలు రైళ్లల్లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల సంఖ్యను ప్రకటించింది. పండుగ సెలవుల కారణంగా తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్లే ప్రయాణికులకు రైల్వేశాఖ గుడ్ న్యూస్ తెలిపింది. తిరుపతి మార్గంలో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతుండగా.. వీటిల్లో చాలా బెర్త్‌లు ఖాళీగా ఉన్నట్లు తెలిపింది. జల్నా--తిరుపతి(07814) రైలులో అక్టోబర్ 15న 218, అక్టోబర్ 22న 158, అక్టోబర్ 29న 512 బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ఇక నవంబర్ 5న 597, నవంబర్ 19న 451, నవంబర్ 26న 690 బెర్తులు ఖాళీగా ఉన్నాయి. అలాగే హజూర్ సాహిబ్ నాందేడ్--తిరుచానూరు(07603) రైలులో అక్టోబర్ 13న 487, అక్టోబర్ 20న 708, అక్టోబర్ 27న 784 బెర్తులు, నవంబర్ 3న 899, నవంబర్ 10న 513, నవంబర్ 17న 848, నవంబర్ 24న 898 బెర్తులు ఖాళీగా ఉన్నాయి.

బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులకు కూడా పలు రైళ్లల్లో బెర్తులు ఖాళీగా ఉన్నాయి. జల్నా--యెలహంక(07601) రైలులో అక్టోబర్ 18న 767, అక్టోబర్ 25న 621 బెర్త్‌లు ఉన్నాయి. చర్లపల్లి--ాఎిఎ బెంగళూరు(07065) రైలులో అక్టోబర్ 12న 190, అక్టోబర్ 19న 632, అక్టోబర్ 26న 702 బెర్తులు, నవంబర్ 2న 762, నవంబర్ 9న 752, నవంబర్ 16న 761, నవంబర్ 23న 764, నవంబర్ 30న 746 బెర్తులు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. చర్లపల్లి--నరసాపురం(07063) స్పెషల్ ట్రైన్‌కు సంబంధించి అక్టోబర్ 19న 195, అక్టోబర్ 26న 437, నవంబర్ 2న 466, నవంబర్ 9, 16, 23, 30 తేదీల్లో ఒక్కో రోజుకు 470 బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ఇక సికింద్రాబాద్--కాకినాడ టౌన్ (07039) ట్రైన్‌లో అక్టోబర్ 21న 354, అక్టోబర్ 28న 712 బెర్తులు ఖాళీగా ఉండగా.. దీపావళికి ఇంటికెళ్లేవారికి నవంబర్ 4న 759, నవంబర్ 11న 777, నవంబర్ 18న 775, నవంబర్ 25న 765 బెర్తులు అందుబాటులో ఉన్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే స్పష్టం చేసింది.

## విమానం ప్రయాణంలో ఈ వస్తువులకు నో ఎంట్రీ ఏయే వస్తువులు మీ వెంట తీసుకెళ్లవచ్చంటే..?

విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని వస్తువులను అధికారులు తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వరు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా కొన్ని వస్తువులు మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. విమాన ప్రయాణాలు చేసేవారు వీటి గురించి ముందే అవగాహన కలిగి ఉండాలి. అసలు ఏయే వస్తువులు తీసుకెళ్లవచ్చు? వేటికి అనుమతి ఉండదు? అనేది చూద్దాం.

ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడు తన వెంట తెచ్చుకున్న పవర్ బ్యాంక్‌కు మంటలు అట్టుకోవడం కలకలం రేపింది. దీంతో భద్రతా కారణాల వల్ల ఆ విమానాన్ని హైదరాబాద్‌కు అధికారులు మళ్లించారు. ఈ పరిణామంతో కొద్దిసేపు ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఒక ప్రశ్న తెరపైకి వచ్చింది. అసలు విమానాల్లో ఏయే వస్తువులు తీసుకెళ్లవచ్చు? ఏయే వస్తువుల తీసుకెళ్లకూడదు? అనే విషయాలు చూద్దాం.

1 / 5

హ్యాండ్ బాగుల్లో ల్యాప్ టాప్, కెమెరాలు, మొబైల్స్, టాబ్లెట్, మెడిసిన్స్, గోల్డ్, నగదు, ముఖ్యమైన పత్రాలు, 100 ఎంఎల్ కంటే తక్కువ పరిమాణం కలిగి పర్ఫ్యూమ్స్, జెల్స్, లోషన్లు లాంటివి తీసుకెళ్లవచ్చు. ఇక డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ కాపీని కూడా తీసుకెళ్లవచ్చు.

2 / 5

అయితే పదునైన వస్తువులను విమానంలోకి తీసుకెళ్లడానికి అనుమతించరు. నెయిల్ కట్టర్లు, బ్లేడ్లు, చాకులు, కత్తెరలు, బాక్స్ కట్టర్లు తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. ఇక అగ్గిపెట్టెలు, లైటర్లు, ఆటబొమ్మ తుపాకులు, 100 ఎంఎల్ కంటే ఎక్కువ పరిమాణం కలిగిన ద్రవ పదార్థాలను తీసుకెళ్లనివ్వరు. ఇక పేలుడు పదార్థాలు, బ్లీచ్, యాసిడ్, పాదరసం లాంటి వాటితో పాటు ఎండిన కొబ్బరి కూడా తీసుకెళ్లడానికి వీలుండదు.

3 / 5

విమాన ప్రయాణం చేసేటప్పుడు పవర్ బ్యాంక్ తీసుకెళ్లవచ్చు. కానీ కొన్ని భద్రతా నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఎందుకుంటే పవర్ బ్యాంక్‌లు లిథియం బ్యాటరీలతో పనిచేస్తాయి. వేడి ఎక్కువైనప్పుడు మంటలు వచ్చే అవకాశముంటుంది. దీంతో విమానంలో పవర్ బ్యాంక్ ఉపయోగానికి సంబంధించి కొన్ని రూల్స్ అమల్లో ఉన్నాయి.

4 / 5



విమానాల్లోకి కేవలం 100 ఔష్ట్ర వరకు సామర్థ్యం ఉన్న పవర్ బ్యాంక్‌లను మాత్రమే అనుమతిస్తారు. ఆపైన సామర్థ్యం కలిగిన వాటిని తీసుకెళ్లడానికి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే పవర్ బ్యాంక్‌లను చెక్ ఇన్ బ్యాగుల్లో కాకుండా హ్యాండ్ బ్యాగ్ లేదా క్యాబిన్‌లోకి తీసుకెళ్లే బ్యాగ్‌లో మాత్రమే ఉంచుకోవాలి. ఇక వీటిని ఓవర్ హెడ్ బిన్ లేదా సీట్లపైన ఉండే లగేజ్ కంపార్ట్‌మెంట్లలో ఉంచకూడదు.

## దసరా పండక్కి ముందే అకౌంట్లోకి డబ్బులు పీఎఫ్ ఖాతాదారులకు కేంద్రం శుభవార్త చెక్ చేసేయ్యండి

ఈపీఎఫ్‌వో కీలక ప్రకటన చేసింది. గత నెలకు సంబంధించి పీఎఫ్ కాంట్రిబ్యూషన్ జమ చేయడానికి కంపెనీలకు డెడ్ లైన్ విధించింది. ప్రతీ నెలా ఉద్యోగి జీతం నుంచి కట్ చేసే సొమ్మును తర్వాతి నెలలో యాజమాన్యాలు పీఎఫ్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పీఎఫ్ డబ్బులు మీ అకౌంట్లో ఇంకా పడలేదని ఆందోళన చెందుతున్నారా..? నో టెన్షన్.. మరో మూడ్రోజుల్లో జమయ్యే అవకాశముంది. ఈ మేరకు కంపెనీలకు ఈపీఎఫ్‌వో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 15వ తేదీలోపు సెప్టెంబర్ నెలకు సంబంధించిన కాంట్రిబ్యూషన్లు జమ చేయాలని ఆదేశించింది. ఈ విషయాన్ని తెలుపుతూ ఈపీఎఫ్‌ఓ తన ఎక్స్ అకౌంట్లో ఒక పోస్ట్ చేసింది. ఈపీఎఫ్‌ఓ నిబంధనల ప్రకారం యజమానులు ప్రతీ నెలా 15వ తేదీలోపు ముందు నెలకు సంబంధించిన చందాను ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలోగా క్రెడిట్ చేయకపోతే కంపెనీలకు, ఆలస్యమైన సమాయానికి వడ్డీ వంటివి విధించే అవకాశముంది. ఆలస్యమైతే ఉద్యోగి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈపీఎఫ్‌ఓకు ఫిర్యాదు కూడా చేయవచ్చు. అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ వస్తున్న క్రమంలో తమ ఖాతాదారులకు ఈపీఎఫ్‌ఓ గుడ్ న్యూస్ తెలిపింది. అక్టోబర్ 15లోగా కంపెనీలు ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో కాంట్రిబ్యూషన్ జమ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. "యజమానులకు ముఖ్య గమనిక.. సెప్టెంబర్ నెలకు సంబంధించిన జుజ=ను ఫైల్ చేసి చెల్లింపులను అక్టోబర్ 15, 2026 లోగా జమ చేయండి. జుజ=ను సకాలంలో ఫైల్ చేసి నిబంధనలు పాటించండి. ఉద్యోగుల




సామాజిక భద్రతను బలోపేతం చేయండి" అంటూ ఈపీఎఫ్‌ఓ తన ఎక్స్‌లో తెలిపింది.